సాక్షి
మెదక్
బుధవారం । 15 । నవంబర్ । 2023



బాబ్బాబ్..!
ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేసిన స్వతంత్ర అభ్యర్థులను నామినేషన్లు వెనక్కి తీసుకోవాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు బుజ్జగిస్తున్నారు.
వివరాలు 10లో ▸



ఘనంగా బాలల దినోత్సవం
జిల్లా వ్యాప్తంగా మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు.
వివరాలు 11లో ▸



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి
కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
వివరాలు 11లో ▸

అంతా రెడీ

నేడు మెదక్‌లో ప్రజా ఆశీర్వాద సభ

- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ నేతలు
- భారీ జన సమీకరణకు సన్నాహాలు

మెదక్: మెదక్‌లోని సీఎస్ఐ చర్చి మైదానంలో బుధవారం నిర్వహించే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద ఎన్నికల సభకు అంతా సిద్ధమైంది. సభకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ ముఖ్యనేతలు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సీఎం కేసీఆర్ హాజరుకానున్న నేపథ్యంలో భారీ జన సమీకరణకు ప్లాన్ చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గం నుంచి 50 వేల జనాన్ని తరలించనున్నారు. సభా ప్రాంగణం సమీపంలోనే హెలీప్యాడ్ దిగేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలో సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లతోపాటు అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిల కటౌట్లు, హోర్డింగ్‌లో పెట్టారు. సీఎం సభకు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చే వాహనాలను సభా ప్రాంగణ సమీపంలో గల జూనియర్ కళాశాల గ్రౌండ్, గాంధీనగర్, చర్చి ఎదుట ఖాళీ స్థలాల్లో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడు మాసాల్లో రెండోసారి..

మెదక్‌లోని కొత్త కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతో పాటు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవానికి ఆగస్టు 23న సీఎం కేసీఆర్ మెదక్ వచ్చారు. మూడు మాసాల్లో రెండోసారి. అప్పుడు అధికారికంగా పార్టీ కార్యక్రమాలకు సీఎం హోదాలో రాగా, ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వస్తుండడంతో సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, వీవీపీలు, పార్టీ శ్రేణులు, ప్రజలు కూర్చునే గ్యాలరీలను పరిశీలించి సూచనలు చేశారు.



ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని, ఇతర అధికారులు


సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ

సీఎం కేసీఆర్ నిర్వహించనున్న ఎన్నికల ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎస్పీ రోహిణీప్రియదర్శినితో పాటు అదనపు ఎస్పీ మహేందర్, పట్టణ సీఐలు పరిశీలించారు. సభా స్థలి పక్కనే హెలీప్యాడ్ కోసం అంతా సిద్ధం చేశారు. సభ నిర్వహించే ప్రాంగణాన్ని అంతా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు.

ఎత్తుగడలో భాగమేనా..

స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు

- ఎన్నికల లెక్కలు కలిసొచ్చేందుకు, ప్రత్యర్థిని దెబ్బతీసేందుకు
- మెదక్ నియోజకవర్గానికి 18 మంది నామినేషన్లు
- పరిశీలనలో ఒకటి తిరస్కరణ
- ఉపసంహరణకు నేడే ఆఖరు



మెదక్: ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసి బరిలో నిలబడడం ఎత్తుగడలో భాగమేనని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులే వారి అనుచరులతో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థి ఉపయోగించే వాహనాలు, ఎన్నికల ఖర్చు, పోలింగ్ ఏజెంట్ తదితర లబ్ధిని పొందేలా చూస్తున్నారు.

మెదక్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్, బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ ప్రధాన పార్టీలకు చెందిన వారు. వీరితోపాటు గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఆరుగురు, స్వతంత్ర అభ్యర్థులుగా తొమ్మిది మంది నామినేషన్లు వేశారు. ఈ నెల 13న జరిగిన స్క్రూటినీలో జంగంపల్లి రంగాగౌడ్ అనే స్వతంత్ర అభ్యర్థి అఫిడవిట్ సరిగా లేనందున నామినేషన్ తిరస్కరణకు గురైంది. ప్రస్తుతం ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులు, ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు, మరో ఆరుగురు వివిధ పార్టీలకు చెందినవారు, మొత్తం 17 మంది బరిలో ఉన్నారు.

రూ.40 లక్షల వరకు ఖర్చు

స్వతంత్ర అభ్యర్థులుగా ఎనిమిది మంది బరిలో ఉండగా, ఇందులో మైనంపల్లి వర్గానికి చెందిన వారు ఒకరు. పద్మాదేవేందర్‌రెడ్డి వర్గానికి చెందిన వారు మరొకరు ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల నిబంధనల మేరకు ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షల మేర ఖర్చు చేసే వీలుంటుంది. అభ్యర్థులు ప్రచార వాహనాలు ఉపయోగించడం, పోలింగ్ బూత్‌లలో ఏజెంట్ల ఏర్పాటు, ఇతర ఖర్చులు చేసుకోవచ్చు. ఇందులో భాగంగానే స్వతంత్ర అభ్యర్థుల పేరుతో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఖర్చు చేసేందుకు వీలు ఉంటుంది. అందుకే ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ పార్టీల గుర్తుపై స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దించడం ఎత్తుగడలో భాగమే అని పలువురు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

ఉపసంహరణలకు నేడు ఆఖరు..

ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి నేడు (బుధవారం) చివరి అవకాశం. ఒక వేళ విత్ డ్రా చేసుకోకుంటే ఆయా పార్టీల గుర్తులతోపాటు స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను ఎన్నికల సంఘం అందజేస్తుంది.

గత ఎన్నికల్లో ప్రధాన పార్టీకి గండి

2018 ఎన్నికల్లో మెదక్ స్వతంత్ర అభ్యర్థికి రోడ్డు రోలర్ గుర్తు కేటాయించారు. దీంతో ఆ ఎన్నికల్లో రోడ్డు రోలర్ గుర్తు అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. 4వ స్థానంలో బీజేపీ అభ్యర్థి రాజయ్య నిలిచారు. ఇందుకు ప్రధాన కారణం కారు గుర్తును పోలిన రోడ్డు రోలర్ ఉండడమే అని తెలుస్తుంది.

న్యూస్‌రీల్

మూడు నామినేషన్ల ఉపసంహరణ

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలో నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ముగ్గురు తమ నామినేషన్లను మంగళవారం ఉపసంహరించుకున్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనీల్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కాగా, బీఆర్ఎస్‌కు చెందిన లకావత్ రమేశ్ స్వతంత్ర అభ్యర్థిగా, పిట్ల నవీన్‌కుమార్ యుగతులసి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేయగా, వారు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



శ్రావికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ మండలం జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. తొర్రూర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో భాగంగా అండర్-19 విభాగంలో ఉషు ఆటలో ఇంటర్ విద్యార్థిని శ్రావిక ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రావికను పాఠశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీడీ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు



అనాథ ఆశ్రమంలో న్యాయమూర్తి అనిత

శివ్వంపేట(నర్సాపూర్): బాలలతో పనులు చేయిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ కోర్టు సివిల్ జూనియర్ న్యాయమూర్తి అనిత హెచ్చరించారు. మంగళవారం మండల పరిధి మగ్దుంపూర్‌లోని బేతానీ సంరక్షణ అనాథ ఆశ్రమంలో జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ, మండల లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అనిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమానికి రూ.8 వేలు విరాళం అందజేశారు. అనాథ పిల్లలను ఆదరిస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్‌ని అభినందించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ దేవదాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూకుమ్మడి రాజీనామా

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి



రాజీనామా పత్రాలు చూపుతున్న గోపి, ఇతర నాయకులు

నర్సాపూర్ : తనతోపాటు చాలా మంది పార్టీ నాయకులు మూకుమ్మడిగా బీజేపీకి రాజీనామా చేస్తున్నామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని 138 మంది బూత్ కమిటీల అధ్యక్షులు, శివ్వంపేట పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నర్సాపూర్ మండల మాజీ అధ్యక్షుడు మాణయ్య, కౌన్సిలర్ సునీతా, మండల రూరల్ పార్టీ ఇన్‌చార్జి బాల్‌రెడ్డి, ఎనిమిది మంది వార్డు మెంబర్లు రాజీనామా చేసి తమ రాజీనామా పత్రాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపుతున్నామని పేర్కొన్నారు. వెల్దుర్తి మండలానికి చెందిన ఎంపీటీసీ నర్సింలు, మరో మండల పార్టీ అధ్యక్షుడితోపాటు మరి కొందరు నాయకులు త్వరలో పార్టీకి రాజీనామా చేస్తారని వివరించారు. ఈటల రాజేందర్ బీజేపీలో చేరిన తర్వాత సిద్ధాంతాలు కనుమరుగయ్యాయని, కుల రాజకీయాలకు ప్రాధాన్యత పెరిగిందని ఆయన ఆరోపించారు. ఇటీవల పార్టీలో చేరిన మురళీయాదవ్‌కు నర్సాపూర్ టికెట్ ఇవ్వడాన్ని సింగాయిపల్లి తప్పుపడుతూ పార్టీలోకి వచ్చిన వారికి పార్టీ హోల్‌సెల్‌గా అమ్ముడు పోయిందని ఆరోపించారు. మురళీ యాదవ్ కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కు అయ్యారని ఇటీవల ఆయన హైదరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డితో సమావేశమయ్యారని ఆరోపించారు. సమావేశంలో శివ్వంపేట పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, బాల్‌రెడ్డి, మాణయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ స్లిప్‌ల పంపిణీ

- 26 వరకు పూర్తి చేయాలి
- రాజకీయ పార్టీలు స్లిప్‌లు పంపిణీ చేయొద్దు
- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టి ఈనెల 26 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. మంగళవారం మెదక్, నర్సాపూర్ ఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్స్, బీఓల్‌ఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ సమాచార స్లిప్‌లతోపాటు, ఓటర్ గైడ్, సీ-విజిల్ కరపత్రాలను ప్రతీ ఓటరుకు పంపిణీ చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి బాధ్యత బీఎల్‌ఓలదేనన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేయొద్దని ఆదేశించారు. ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీకి నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మెదక్ నియోజక వర్గానికి నోడల్ అధికారిగా జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్ (94903 57522), నయాబ్ తహసీల్దార్ ప్రభాకర్ (98669 47429), నర్సాపూర్ నియోజక వర్గానికి సహదేవ్ (93469 99262)ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్, మెదక్, నర్సాపూర్ ఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో..
ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణ నోడల్ అధికారులను నియమించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు.



విద్యార్థులతో కలెక్టర్ రాజర్షిషా

పిల్లల హక్కులు గౌరవించండి

పిల్లల హక్కులను గౌరవించాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్‌లోని బాలసదనంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల రక్షణ యూనిట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల హక్కులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు బ్రహ్మజీ, రాజిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, కరుణ, గంగాధర్ గౌడ్, పద్మ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మనోవికాసం

జ్యోతిబాపూలే బీసీ గురుకుల సొసైటీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి తిరుపతి

వర్గల్(గజ్వేల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, జ్ఞాన వికాసం కోసం విద్యార్థిలోకం పుస్తక పఠనం అలవరచుకోవాలని జ్యోతిబాపూలే బీసీ గురుకుల సొసైటీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి తిరుపతి అన్నారు. మంగళవారం వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మద్దిలేటితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రంథాలు, పుస్తకాలు, రెఫరెన్స్ బుక్స్ తదితర పుస్తకాలతో కొలువైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం మనోవికాసానికి దోహదపడుతుందన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో హైదరాబాద్, మెదక్ ఆర్సీఓలు ఆదిత్యవర్మ, ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ రావు, వీపీ గోవింరావు, ఏటీపీ కే. భాగ్యలక్ష్మి, డీడబ్ల్యూజీ. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి పావని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- ప్రశాంత వాతావరణంలో జరగాలి
- జిల్లా ఎన్నికల పరిశీలకుడు పృథ్వీరాజ్

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల విధుల్లో అధికారులు ఎలాంటి అలసత్వం వహించొద్దని, ప్రశాంత వాతావరణంలో జరగాలని, జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు పృథ్వీరాజ్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ రోహిణీప్రియదర్శిని, ఎన్నికల నోడల్ అధికారులు, పోలీస్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. మెదక్‌లో ఆరు టీమ్‌లు, నర్సాపూర్‌లో ఆరు టీమ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం జిల్లా వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి అనుమతి తోనే ప్రచార సామగ్రి రవాణా చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థి ఖర్చు నమోదు చేయాలని, ప్రతీ సంఘటనను వీడియో కెమెరాలో రికార్డ్ చేయాలని తెలిపారు. జిల్లా పోలీస్ పరిశీలకుడు సంతోష్ కుమార్ తుకారాం మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రజల వద్ద పోలీస్ అధికారి ఫోన్ నంబర్ తప్పక ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల పరిశీలకులకు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



పవర్ పాయింట్‌ను తిలకిస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు

ఎంసీఎంసీ సెంటర్ పరిశీలన..
సాధారణ ఎన్నికల నేపథ్యంలో మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ ఆఫ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల పరిశీలకులు ముగ్గురూ పరిశీలించారు. జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును సమీక్షించారు. అంతకు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూంలను, హవేళిఘణాపూర్‌లోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతదేహాలతో మూడుగంటలపాటు గ్రామస్తుల రాస్తారోకో
- అల్లాదుర్గంలో ఘటన



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు




సాయికుమార్, విజయ్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ స్టేజీ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండల పరిధిలోని సీతానగర్ గ్రామానికి చెందిన చిన్నోల సాయికుమార్ (13), విజయ్ (16), అజయ్ ముగ్గురూ ఒకే బైక్‌పై రాంపూర్ బ్రిడ్జి కింద నుంచి సొంత గ్రామానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి బాన్సువాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రాంపూర్ స్టేజీ వద్ద విద్యార్థుల బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్, విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా, అజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అజయ్‌ను స్థానికులు హైవే అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ పెద్దశంకరంపేట ప్రభుత్వ పాఠశాలలో 9 తరగతి చదువుతుండగా, విజయ్ పెద్దశంకరంపేట మోడల్ స్కూల్‌లో 10 తరగతి చదువుతున్నారు. బస్సు డ్రైవర్ వేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు.

బస్సు అద్దాలు ధ్వంసం
రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు మృతి చెందడంతో ఆగ్రహించిన స్థానికులు, మృతుల బంధువులు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు అద్దాలు పూర్తిగా ధ్వంసం చేశారు. 161 హైవేకి చెందిన మరో వాహనాన్ని సైతం ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఘటన స్థలంలో వీడియో తీస్తున్న సీఐ కార్యాలయం రైటర్ ఫోన్‌ను లాక్కొని పగులగొట్టారు. అలాగే, రాంపూర్ వద్ద 161 జాతీయ రహదారిపై గంటపాటు వాహనాలను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారినా మూడు గంటలపాటు పోలీసులు రాకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు గంటలపాటు ఆయన ఘటనా స్థలంలోనే ఉన్నారు. అనంతరం పోలీసులు వచ్చి ఈ ఘటనపై కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు. బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

యువత చేతిలో భవిత

ఉమ్మడి జిల్లాలో వారిదే మెజార్టీ

- వర్తమాన పరిస్థితులపై పూర్తి అవగాహన
- పార్టీల ఫోకస్

ఉమ్మడి మెదక్ జిల్లాలో యువ ఓటర్లు క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. మెజార్టీ ఓటర్లుగా ఉండటంతో వీరు తీసుకునే నిర్ణయంపైనే అభ్యర్థుల భవిత ఆధారపడి ఉంది. ఐదేళ్లకోసారి వచ్చే అద్భుత అవకాశం ఇప్పుడు యువత చేతిలో ఉండగా సంక్షేమం, అభివృద్ధి ఆకాంక్షించే నాయకులను ఎన్నుకుంటారని భావించవచ్చు.





నారాయణఖేడ్: దేశ భవిష్యత్ నిర్ణయించడంలో నేటి యువతది కీలక పాత్ర. వారు రాజకీయంలో కీలక పాత్ర పోషిస్తారనడంతో ఎటువంటి సందేహం లేదు. ఇప్పుడున్న వారిలో వంద శాతం అక్షరాస్యులే. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న మెజార్టీ ఓటర్లుగా యువత ఉంది. వీరు ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేల్చగలరు. సంగారెడ్డి జిల్లాలో 18-19 ఏళ్ల వయసు గల ఓటర్లు 50, 684 మంది ఉండగా, 20- 29 ఏళ్ల వయసు 3,11,433, 30-39 ఏళ్ల వారు 4,36,764, 40-49 ఏళ్ల వారు 2,72,554 మంది ఉన్నారు. మెదక్ జిల్లాలో 18-19 వయసు ఉన్న వారు 17,061, 20-29 ఏళ్ల వారు 97,390, 30-39 ఏళ్ల వారు 1,15,164, 40-49 ఏళ్ల వారు 94,638 మంది ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 18-19 ఏళ్ల వారు 28,535, 20-29 ఏళ్ల మధ్య 2,00,676, 30-39 ఏళ్ల వారు 2,60,200, 40-49 ఏళ్ల వారు 1,82,977మంది ఉండటం విశేషం.

జిల్లా	మొత్తం ఓటర్లు
సంగారెడ్డి	9,96,474
సిద్దిపేట	9,48,669
మెదక్	4,40,341

యువతపై నేతల దృష్టి..
యువ ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటం, వారు ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉండటంతో రాజకీయ నాయకులు సైతం వారిపై దృష్టి సారిస్తున్నారు. ఎలాగోలా తమకు మద్దతుగా ఉండేలా ఓటు వేసేలా వారిని చైతన్య పర్చాలని ఉవ్విళ్లూరుతున్నారు. తాము గెలిస్తే వారి కోసం చేపట్టబోయే పనుల గురించి వివరిస్తూ గెలుపే లక్ష్యంగా వారిని ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు.

ప్రలోభాలకు లొంగే అవకాశం తక్కువే..
ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రాజకీయ నాయకులు రకరకాల వస్తువులు కానుకలుగా ఇస్తుంటారు. సామాన్యుల్లో కొందరు వారి పరిస్థితుల దృష్ట్యా రాజకీయ నాయకులు ఇచ్చిన వాటికి కట్టుబడి ఓటు వేసే అవకాశం ఉంది. కానీ యువత అలా కాదు. ఎవరు మంచి చేస్తారో వారికే మద్దతు ఇచ్చే అవకాశం ఉంటుంది. చదువుతున్న యువతతో పాటు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఇంటికొకరు ఉంటారు. దీంతో ప్రతి కుటుంబంలో వర్తమాన రాజకీయాలు చర్చిస్తూ, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. వారి ఓటుతోపాటు తమ కుటుంబసభ్యుల ఓట్లు కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో యువత పాత్ర కీలకం కానుంది. ఉమ్మడి జిల్లాలోని జిల్లాల వారీగా యువ ఓటర్లు, మొత్తం ఓటర్ల వివరాలు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయికి విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని అంకిత

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరాలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అంకిత డప్పు కళాకారునిగా రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కళా ప్రదర్శనలో అంకిత జిల్లా స్థాయిలో మొదటి స్థానం దక్కించుకొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు విజయలక్ష్మి తెలిపారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన సీపీ


సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్వేత

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 18న పట్టణ కేంద్రంలో సీఎం కేసీఆర్‌ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక గల సభాస్థలం, పార్కింగ్‌ ప్రదేశాలను మంగళవారం సీపీ శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌ రఘుపతిరెడ్డి, స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఎస్బీ ఎస్‌ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల చోరీ


టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌ బాలుర పాఠశాల/కళాశాల

మిరుదొడ్డి(దుబ్బాక): నేరాలు, దొంగతనాల యంత్రణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ. 3.50 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలను చోరీ చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని అల్వాల, చెప్యాల క్రాస్‌ రోడ్డులో ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌ బాలుర ఉన్నత పాఠశాల/జూనియర్‌ కళాశాలలో జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాల/కళాశాలలో దొంగతనాల నియంత్రణ కోసం 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా సోమవారం రాత్రి దొంగలు పాఠశాల ఆవరణలోకి చొరబడి ప్రధాన సీసీ ఫుటేజీ కేబుల్‌ను కట్‌ చేశారు. దీంతో పాఠశాలతో పాటు హాస్టల్‌లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం ఆగిపోయాయి. దొంగలు 15 సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లారు. కాగా ప్రిన్సిపాల్‌ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌ తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం


తుక్కిబొల్లారంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

ములుగు(గజ్వేల్‌): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్‌ పాలన కొనసాగుతోందని బీఆర్‌ఎస్‌ మండల పార్టీ ఇన్‌చార్జి రవీందర్‌ రావు, వంటిమామిడి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ జహంగీర్‌, ఉమ్మడి మెదక్‌ జిల్లా డీసీసీబీ డైరెక్టర్‌ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని తుక్కిబొల్లారంలో గజ్వేల్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, సీఎం కేసీఆర్‌ తరఫున మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్‌, జెడ్పీ కోఆప్షన్‌ మెంబర్‌ సలీం, ఎంపీపీ లావణ్యఅంజన్‌గౌడ్‌, వైస్‌ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ నరేష్‌గౌడ్‌, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్‌, ఉపాధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, మల్లేష్‌ యాదవ్‌, అయిలయ్యయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

బాబ్బాబ్‌..!

- బుజ్జగింపుల పర్వం మరూ
- స్వతంత్రులు, చిన్న పార్టీల అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు యత్నాలు
- నేడు 3గంటల్లోపే గడువు

నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	అభ్యర్థులు
సంగారెడ్డి	30
జహీరాబాద్‌	28
పటాన్‌చెరు	25
ఆందోల్‌	21
నారాయణఖేడ్‌	20

జంగ్‌ తెలంగాణ

నారాయణఖేడ్‌: సార్వత్రిక ఎన్నికల తరుణంలో నామినేషన్ల పర్వం, పరిశీలన (స్క్రూట్నీ) సైతం పూర్తయింది. ఇక తుది జాబితాలో ఎవరెవరు ఉంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. టికెట్లు దక్కక కొందరు నామినేషన్‌ వేయగా, ఇతరత్రా కారణాలతోనూ ప్రధాన పార్టీల నాయకులు పోటీగా మరొకొందరు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల విత్‌డ్రాకు 15వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే అవకాశం ఉంది. ఇక పోటీలో ఉన్న వారికి గుర్తుల కేటాయింపు జరుగుతుంది. అన్ని నియోజకవర్గాల్లోనూ 20మందికి పైగానే నామినేషన్లు వేశారు. 17 మందికంటే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేస్తే మరో బ్యాలెట్‌ యూనిట్‌ పెట్టాల్సి వస్తుంది. ఇలా రెండు బ్యాలెట్‌ యూనిట్లు ఉంటే ఓటర్లు తికమక పడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో ఎక్కడ తమకు నష్టం వాటిల్లుతుందోనని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు బుజ్జగింపుల పర్వానికి తెరతీశారు. నామినేషన్లు వేసిన స్వతంత్రులకు ఓట్లు పడితే తమ విజయంపై ప్రభావం చూపుతుందని భావించి వారిని పోటీ నుంచి తప్పుకొమ్మని కోరుతున్నారు. దీంతో పాటు తమ పార్టీలో అసంతృప్తులుగా ఉన్న వారెవరైనా వారి వెనుకున్నారా అని ఆరా తీస్తూ అటు అభ్యర్థులను, ఇటు అసంతృప్తులను బుజ్జగిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ హోరాహోరీ పోటీ కన్పిస్తుండటంతో స్వతంత్రులతోపాటు చిన్న పార్టీల తరఫున బరిలో ఉన్న వారిలో సత్తా ఉన్నవారు నామినేషన్‌ ఉపసంహరింపజేసేలా ఎక్కడికక్కడే రహస్యంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరిని నయానో, భయానో విత్‌డ్రా చేయించాలని, లేదా మచ్చిక చేసుకొని విత్‌డ్రా చేయించాలన్న సంకల్పంతో నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గతంలో కొందరు స్వతంత్రులు భారీగానే ఓట్లను కొల్లగొట్టారు. వారివల్ల ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపై ప్రభావం చూపిందనే చర్చ సాగింది. స్వతంత్రులు పొందే గుర్తుల వల్ల కూడా ఎక్కడ తమకు పడాల్సిన ఓట్లు పోతాయోనన్న భయమూ ఆయా పార్టీ అభ్యర్థుల్లో నెలకొంది. నామినేషన్‌ వేసిన వారిని విత్‌డ్రా చేయించి మచ్చిక చేసుకొని తమ వెంట ప్రచారం చేయించాలన్న ఆలోచన కొందరు నాయకులు చేస్తున్నారు. కాగా ఈ యత్నాల్లో నాయకులు ఏమేరకు సఫలీకృతం కాగలరో వేచి చూడాల్సిందే.



ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

అడిషనల్‌ డీసీపీ ఎస్‌.మల్లారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేయాలని, అదేవిధంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అడిషనల్‌ డిసిపి ఎస్‌. మల్లారెడ్డి ఆదేశించారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని భారత్‌ పెట్రోల్‌ బంక్‌ వద్ద ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, మాదకద్రవ్యాలు తదితర వాటి రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతీ చెక్‌పోస్ట్‌ వద్ద పోలీసు సిబ్బంది 24గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

తొగుట సీఐ కమలాకర్‌

తొగుట(దుబ్బాక): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ కమలాకర్‌ సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో మంగళవారం సాయంత్రం కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటువేసి నచ్చిన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే పోలీస్‌ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్‌ కంట్రోల్‌ రూం మొబైల్‌ నంబర్‌ 8712667100 లేదా 100కు కాల్‌ చేయాలని సూచించారు. డబ్బులు, మద్యానికి ఓటును అమ్ముకోవద్దని, మీకు నచ్చిన అభ్యర్థికి నిర్భయంగా ఓటు వేయాలని కోరారు. గ్రామాల్లో వివిధ పార్టీలు నిర్వహించే ప్రచారాన్ని అడ్డుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిటికల్‌ పోలింగ్‌ స్టేషన్లలో పారా మిలటరీ దళాలతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎస్‌ఐ లింగం, సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేటలో ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహిస్తున్న జవాన్లు, పోలీసులు

ప్రతిపక్షాలను తుక్కుగా ఓడించాలి



చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని పెద్దరాజుపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం గ్రామంలో పాత సామాన్లను కొనుగోలు చేసే వారిని కలిసి బండిపై తూకం వేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి.. ప్రతిపక్ష నాయకులను తుక్కుగా ఓడించాలని కోరారు.

గ్యారంటీగా మద్దతు ఇస్తాం...



మద్దూరు(హుస్నాబాద్‌): జనగామ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తరఫున ఆయన కుమారుడు రాకేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. మండలంలోని రేబర్తి గ్రామంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. స్థానికుడైన ప్రతాప్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివయ్యగౌడ్‌, సుదర్శన్‌రెడ్డి, పూల్లూరి రాజు, ఇర్రి రాజు పాల్గొన్నారు.

కారు.. ప్రచారంలో రోజుకో తీరు..



ఓటర్లను ఆకర్షించడానికి బీఆర్‌ఎస్‌ నాయకులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. రోజుకో తీరుగా ప్రచారం చేస్తూ ఓటర్లను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులు టెడ్డిబేర్‌ బొమ్మ వేషధారణలో ఉన్న వ్యక్తితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సిద్దిపేట అభ్యర్థి మంత్రి హరీశ్‌రావుకు మద్దతు పలకాలని, కారు గుర్తుకు వేయాలని విజ్ఞప్తి చేశారు. – సిద్దిపేటజోన్‌

చికెన్‌ కొట్టు.. ఓటు పట్టు



ఎన్నికల వేడి గ్రామాలలో జోరందుకున్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నాయకులు వినూత్నంగా ప్రచారం కొనసాగిస్తున్నారు.మంగళవారం మనోహరాబాద్‌లో జెడ్పీ చైర్‌పర్సన్‌ ర్యాకల హేమలత ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓ చికెన్‌ షాపులో కత్తితో మాంసం కొడుతూ ఓటర్లను ఆకట్టుకున్నారు. అదేవిధంగా కాళ్ళకల్‌లో రాష్ట్ర కార్పొరేషన్‌ మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ముప్పిరెడ్డిపల్లిలో పెంటన్న ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. –మనోహరాబాద్‌(తూప్రాన్‌)

ఓటేస్తా గానీ.. స్వీట్‌ తినండమ్మ..



పట్టణంలో మంగళవారం కాంగ్రెస్‌ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి అనుపమ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్‌ షెట్కార్‌ కూతురు గిరిజా షెట్కార్‌లు మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. పలు దుకాణాలు, ఇళ్లకు వెళ్లి కాంగ్రెస్‌ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. ఓ దుకాణ యజమాని ప్రచారానికి వచ్చిన మహిళలకు స్వీట్లు అందించారు. –నారాయణఖేడ్‌

సీసీఐ కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

హుస్నాబాద్‌: పత్తిని దళారులకు అమ్మి మోసపోకుండా సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి రైతులు ప్రభుత్వ గిట్టుబాట ధర పొందాలని వ్యవసాయ మార్కెట్‌ కార్యదర్శి సుజన్‌ కుమార్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి విక్రయించాలనుకునే రైతులు కేంద్రాలకు ఆధార్‌ కార్డు, పట్టాదార్‌ పాస్‌ పుస్తకం తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. ఆర్‌కె కాటన్‌ మిల్లు (పోతారం ఎస్‌), గోమాతా కాటన్‌ మిల్లు (హుస్నాబాద్‌), బాలాజీ కాటన్‌ మిల్లు (పందిల్ల), ఎస్‌ఆర్‌ఆర్‌ కాటన్‌ మిల్లు (పందిల్ల), మహాలక్ష్మి కాటన్‌ మిల్లు (జిల్లెల్లగడ్డ) సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7200 లభిస్తుందన్నారు. తేమ శాతం 8 నుంచి 12 శాతం ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తారని తెలిపారు.

హైస్కూల్లో గ్రంథాలయం ప్రారంభం

కొండపాక(గజ్వేల్‌): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్లో మంగళవారం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బాల చెలిమి గ్రంథాలయం, సైన్సు ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆలోచనా విధానం, జ్ఞానం పెంపొందించుకునేందుకు దోహదపడుతాయన్నారు. పుస్తకాలు చదవడం, రాయడం ఎంతో లాభదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం సత్తయ్య, ఖైజర్‌, అశోక్‌, మనోజ్‌ పాల్గొన్నారు.


చిన్న కిష్టాపూర్‌ పాఠశాలలో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆకస్మిక తనిఖీ

జగదేవ్‌పూర్‌ (గజ్వేల్‌): బాలల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని చిన్నకిష్టాపూర్‌ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయురాలు సుధారాణి తన కూతురును ఇదే పాఠశాలలో చేర్పించినందుకు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌, ఉపాధ్యాయులు అశోక్‌, శేఖర్‌ పాల్గొన్నారు

ప్రజా ఆశీర్వాదంతో మరోసారి గెలుస్తా

- దుబ్బాకలో బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం
- కేసీఆర్‌ పాలనకు అంతిమ ఘడియలు
- బీజేపీ దుబ్బాక అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్‌: కేసీఆర్‌ నిరంకుశ పాలనకు అంతిమ ఘడియలు ఆసన్నమయ్యాయని, తెలంగాణను దోచుకుతిన్న కేసీఆర్‌ కుటుంబానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పబోతున్నారని బీజేపీ దుబ్బాక అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని రాజక్కపేట, దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌లో ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలు భారీగా తరలివచ్చి మంగళహారతులు, బోనాలతో స్వాగతం పలికారు. మహిళలు వీర తిలకం దిద్ది తప్పకుండా ఘన విజయం సాధిస్తావంటూ ఆశీర్వదించారు. అనంతరం జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్‌ కుటుంబం బాగుపడ్డదే తప్ప.. ప్రజల బతుకులు ఏం మాత్రం మారలేవన్నారు. కేసీఆర్‌ కుటుంబంలో కొడుకు, అల్లుడు మంత్రులు, బిడ్డ ఎమ్మెల్సీ ఇవి చాలవన్నట్టు సడ్డకుని కొడుకు సంతోష్‌రావుకు రాజ్యసభ పదవి.. ఇది ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచించాలన్నారు. నిరుద్యోగుల ఆశలను కేసీఆర్‌ ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. వారి ఉసురు కేసీఆర్‌ కుటుంబానికి తప్పకుండా తగులుతుందన్నారు.

దుబ్బాకపై నాకున్న ప్రేమ.. హరీశ్‌కు ఎందుకుంటది..?

దుబ్బాకపై తనకున్న ప్రేమ హరీశ్‌రావుకు ఎందుకుంటదని, కేవలం ఎన్నికల ముందు వచ్చి దుబ్బాక, సిద్దిపేట రెండు కళ్లు అంటూ కపట ప్రేమ ఒలకబోసే హరీశ్‌కు మరోసారి దుబ్బాక ప్రజల తడాఖా ఏంటో చూపాలని ఎమ్మెల్యే రఘునందన్‌ రావు పిలుపునిచ్చారు. దుబ్బాకలో గెలిచేందుకు హరీశ్‌ ఎన్నో డ్రామాలు, పడరాని పాట్లు పడుతున్నారని.. ఆయన ఎన్ని చేసినా బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. దుబ్బాక ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో మరోసారి గెలుపొందుతానన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి న్యాయపరంగా రావాల్సిన నిధులను రాకుండా ప్రభుత్వం, మంత్రి హరీశ్‌ అడ్డుకున్నారని విమర్శించారు. ఉప ఎన్నికల్లో గెలవకుండా అడుగడుగునా హరీశ్‌రావు అడ్డుపడ్డా చైతన్యవంతులైన దుబ్బాక ప్రజల వద్ద ఆ పప్పులు ఉడకలేదన్నారు. మరోసారి ప్రజలు నాకు అండగా నిలిచి గెలిపిస్తారన్నారు.


రుక్మాపూర్‌ ప్రచారంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

భారీగా చేరికలు

దుబ్బాక పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలు, దౌల్తాబాద్‌, చేగుంట మండలాల బీఆర్‌ఎస్‌ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకున్నా..

చేగుంట: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోయినా బీజేపీ తరఫున దుబ్బాకలో ఎమ్మెల్యేగా జాబ్‌మేళా ఏర్పాటు చేసి 1500 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిట్లు రఘునందన్‌రావు తెలిపారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌, రుక్మాపూర్‌, కరీంనగర్‌, సోమ్లాతండాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇబ్రహీంపూర్‌ గ్రామంలో 634, 485 సర్వేనంబర్లతో పాటు రుక్మాపూర్‌ గ్రామంలో భూసమస్యలు ఉన్నాయని, అసెంబ్లీలో సైతం ప్రశ్నించినట్లు తెలిపారు. భూసమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. స్థానిక సమస్యలపై ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఎప్పుడూ పట్టించుకోలేదని విమర్శించారు. బీజేపీ అభ్యర్థిగా గెలిచిన రెండేళ్లలో 15వేల మందికి డ్రైవింగ్‌ లైసెన్స్‌లు సొంత ఖర్చుతో ఇప్పించినట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపూర్‌ విద్యార్థులకు ప్రమాదం జరిగితే స్పందించి మెరుగైన వైద్యం అందించానని తెలిపారు. బీజేపీని గెలిపిస్తే భార్యాభర్తలకు పింఛన్‌, 5ఏళ్ల వరకు ఉచిత బియ్యం, కొత్త రేషన్‌ కార్డులు అందిస్తామని తెలిపారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించినందున బీసీలు ఐక్యం కావాలని కోరారు. ఇబ్రహీంపూర్‌ ఇంటర్‌ విద్యార్థులు ఎమ్మెల్యేకు రెండు వేల రూపాయల ప్రచార నిధిని అందించారు.

స్వల్ప ఉద్రిక్తత

రుక్మాపూర్‌ గ్రామంలో ఇద్దరు యువకులు రఘునందన్‌ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మద్యం మత్తులో ఉన్న యువకులు రఘునందన్‌పై దాడి చేస్తారేమో అనే అనుమానంతో వారిని పోలీసులకు అప్పగించారు. దీంతో ప్రచారంలో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాయచంద్రం, మాజీ ఎంపీపీ పాండు, నియోజకవర్గ కన్వీనర్‌ చారి, కో కన్వీనర్‌ గోవింద్‌, మండల శాఖ అధ్యక్షుడు భూపాల్‌, వెంగళరావు పాల్గొన్నారు.

రఘునందన్‌రావును గెలిపించాలి

తొగుట(దుబ్బాక): ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని చందాపూర్‌ సర్పంచ్‌ నర్సింలు యాదవ్‌ కోరారు. మండలంలోని గోవర్దనగిరిలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీతోనే దుబ్బాక అభివృద్ధి

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మున్సిపల్‌ అధ్యక్షుడు సుభాష్‌ రెడ్డి అన్నారు. దుబ్బాక అభ్యర్థి మాధవనేని రఘునందన్‌ రావుకు మద్దతుగా బీజేపీ నాయకులు మంగళవారం దుబ్బాక పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మచ్చ శ్రీనివాస్‌, ప్రవీణ్‌కుమార్‌, రమణారెడ్డి, నేహాల్‌గౌడ్‌, గణేష్‌రెడ్డి, తదితరులున్నారు.


చేగుంట : యువకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తున్న రఘునందన్‌రావు


బీజేపీ లో చేరిన బీఆర్‌ఎస్‌ నాయకులు, ప్రజాప్రతినిధులు


తొగుట మండలం గోవర్దనగిరి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నర్సింలు యాదవ్‌